ఆదర్శం.. పీజీ వాకర్స్

- ఒకవైపు వ్యాయామం.. మరోవైపు సామాజిక సేవ
- రెండేళ్ల క్రితం పీజీ కాలేజీ వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు
- ఉచిత మెడికల్ క్యాంపులు, యోగా శిక్షణ, ఆరోగ్యంపై కౌన్సెలింగ్
- 15 మందితో మొదలై 200 మందికి చేరిన గ్రూప్

సండే స్పెషల్

కోల్‌సిటీ(రామగుండం): అజీర్తి నుంచి ఆర్థరైటిస్ వరకు.. రక్తపోటు నుంచి గుండెపోటు వరకు, మధుమేహం నుంచి మానసిక సమస్య వరకు ఏదైనా నయం కావాలంటే రోజూ వ్యాయామం, నడక తప్పనిసరి. క్షణం తీరిక లేకుండా ఉద్యోగం, బిజినెస్‌లో హడావుడిగా గడిపే పట్టణవాసులు... మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు వ్యాయామాన్ని జీవన విధానంలో భాగంగా చేసుకుంటున్నారు. ఉదయాన్నే వాకింగ్, ఎక్సర్‌సైజ్ చేస్తున్నారు. నడకతోనే ఆరోగ్యం బాగుంటుందని గోదావరిఖనిలో మైదానం బాటపట్టిన కొందరు 'పీజీ వాకర్స్ అసోసియేషన్' పేరుతో 200 మందికిపైగా వాకర్స్‌ను ఏకతాటిపైకి తెచ్చారు. ఒకవైపు సంపూర్ణ ఆరోగ్యం కోసం నడుస్తూనే.. మరోవైపు వాకర్స్ కష్టసుఖాల్లో ఐక్యంగా పాలుపంచుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.


పీజీ వాకర్స్ గ్రూప్ సభ్యులు

రెండేళ్ల క్రితం అసోసియేషన్ ఏర్పాటు..

గోదావరిఖని పీజీ కాలేజీ మైదానం ఉదయం, సాయంత్రం వాకర్స్‌తో సందడిగా మారుతుంది. 2021 జూన్ 21న 'పీజీ కాలేజీ వాకర్స్ అసోసియేషన్'తో వాకర్స్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. తొలుత 15 మందితో ప్రారంభించిన ఈ వాకర్స్ గ్రూప్.. ప్రస్తుతం 200 మందికిపైగా వాకర్స్ ఏకతాటిపైకి వచ్చారు. సభ్యులెవరైనా వాకింగ్‌కు రాకుంటే, ఫోన్ చేసి క్షేమసమాచారాలు అడిగి తెలుసుకుంటారు. రెగ్యులర్‌గా వాకింగ్‌కు రావాలని కౌన్సెలింగ్ ఇస్తారు. అనారోగ్యంగా ఉంటే ఇంటికి, లేదా ఆస్పత్రికి వెళ్లి స్వయంగా పరామర్శించి మానసిక ధైర్యం కల్పిస్తున్నారు.

ఆపదలో అండగా నిలుస్తున్నారు..

- ఒక వాకర్ గుండెపోటుతో చనిపోతే రూ.5వేల విలువగల నిత్యావసరాలు అందజేత.
- వాకింగ్‌కు వచ్చే ఒక యువతి వివాహానికి రూ.18వేలు ఆర్థికసాయం చేశారు.
- పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు నెల రోజులు ఉడకబెట్టిన కోడిగుడ్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు.
- మైదానంలో ఉచిత మెడికల్ క్యాంపులతోపాటు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహిస్తున్నారు.
- మైదానంలో స్వచ్ఛందంగా శ్రమదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
- ప్రముఖ యోగా శిక్షకులతో ఉచితంగా శిక్షణ ఇప్పించడం.
- ఓపెన్ జిమ్‌లో మెలకువలు నేర్పించడం, వాటికి ఉచితంగా మరమ్మతు చేయించడం.


యోగా శిక్షణ పొందుతున్న సభ్యులు


మైదానంలో శ్రమదానం చేస్తున్న వాకర్స్


నిత్యవసరాలు అందజేస్తున్న సభ్యులు (ఫైల్)

ఆరోగ్యంపై అవగాహన



ప్రతిరోజూ వాకింగ్ చేస్తూనే, వాకర్స్ కష్టసుఖాల్లో తోడుగా ఉంటాం. వాకర్స్ అసోసియేషన్ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విరాళాలు సేకరించి ఆపదలో ఉన్న వారికి అందజేస్తున్నాం. ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి వేడుకను అందరం కలిసే జరుపుకుంటున్నాం.

– గడ్డం మధు, వాకర్స్ అసోసియేషన్ బాధ్యుడు

ప్రతిరోజూ ఉత్సాహంగా..



ఒకరోజు వాకింగ్‌కు వెళ్లకుంటే ఏదో వెలితిగా ఉంటుంది. వాకర్స్ అందరం కుటుంబ సభ్యుల్లుగా ఆత్మీయంగా ఉంటున్నాం. పచ్చని చెట్ల వాతావరణంలో మంచి ఆరోగ్యం కోసం బాధలన్నీ మర్చిపోయి సంతోషంగా వాకింగ్ చేస్తున్నాం. ప్రతిరోజూ చాలా ఉత్సాహంగా ఉంటుంది.

– సారయ్య, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి

ఉచితంగా యోగా నేర్పిస్తున్నాం



ప్రతీ ఒక్కరూ మానసికోల్లాసం, చక్కటి ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటారు. కానీ ఉదయాన్నే యోగా, వాకింగ్ చేయడానికి మాత్రం చాలా మంది బద్ధకంగా ఉంటారు. పీజీ కాలేజీ మైదానానికి వస్తున్న వాకర్స్‌లలో ఉత్సాహం నింపడానికి కృషి చేస్తున్నాం. ఒకవైపు వ్యాయామం చేసుకుంటూనే.. మరోవైపు ఉచితంగా యోగా నేర్పిస్తున్నాం. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్నాం. ప్రతి ఒక్కరూ వాకింగ్ చేయడానికి ముందుకు రావాలి.

– అన్నపూర్ణ, యోగా గురూజీ

క్లుప్తంగా

స్వచ్ఛ పెద్దపల్లిగా తీర్చిదిద్దుదాం


అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

పెద్దపల్లిరూరల్: పట్టణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ సహకరించి స్వచ్ఛ పెద్దపల్లిగా గుర్తింపు తెచ్చేందుకు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి కోరారు. పట్టణంలోని 31వ వార్డులో శనివారం తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించే పనులను ఆమె తనిఖీ చేశారు. పారిశుధ్య సిబ్బందికి సూచనలివ్వడంతో పాటు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను, ఇతర వ్యర్థాలను వేరుగా అందించాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరెడ్డితో పాటు కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన


పనులను పరిశీలిస్తున్న అధికారులు

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో భాగంగా మండలస్థాయి పీర్ వెరిఫికేషన్ బృందం పర్యటించింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సెల్ఫ్ అసెస్‌మెంట్ వివరాలను పరిశీలించి నివేదికను ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేశారు. అనంతరం గ్రామంలోని మన ఊరు–మనబడి పనులను పరిశీలించారు. ఎంపీడీవో వేణుగోపాల్ రావు, సర్పంచ్ తిరుపతి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ


తనిఖీ చేస్తున్న అధికారులు

ధర్మారం: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను శనివారం జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. దుకాణాల్లో ఉన్న నిల్వలను పరిశీలించారు. రికార్డులు, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి పూర్ణిమ, ఏఈవోలు పాల్గొన్నారు.

తరుగు పేరిట కోత విధించొద్దు


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు వస్తే పాలకులు, అధికారులు, మిల్లర్లతో కలిసి క్వింటాల్‌కు 7నుంచి 10కిలోల ధాన్యాన్ని తరుగుపేరిట కోత విధిస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు పర్శ సమ్మయ్య ఆరోపించారు. మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం వారు నిరసన వ్యక్తం చేశారు. రైతుల నుంచి ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని, కోతలు విధించొద్దని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందించారు. నాయకులు సందీప్, ఫహీం, రవి, నర్సింగం, కుమార్, మల్లారెడ్డి, శంకర్, రమేశ్, సదయ్య, సతీశ్, రాజయ్య, కరుణాకర్, శ్రీనివాస్, రామస్వామి, శంకర్ ఉన్నారు.

లింగాపూర్‌లో పోచమ్మ బోనాలు


బోనాలతో ఊరేగింపుగా మహిళలు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామంలో శనివారం పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా బోనాలతో మహిళలు పెద్దఎత్తున పోచమ్మ ఆలయానికి తరలివచ్చి నైవేద్యం సమర్పించారు. ఈ వేడుకల్లో పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, రామగుండం కార్పొరేటర్ కౌశిక లత, బీఎస్పీ జిల్లా ప్రతినిధి ఇరికిళ్ల రాజనర్సయ్య, ఇరికిళ్ల పద్మ, అర్శనపల్లి మల్లేశ్వరి, నిమ్మరాజుల సాగర్, నిమ్మరాజుల రవి పాల్గొన్నారు.

గాయత్రి హోమం


హోమం నిర్వహిస్తున్న శ్రీనంబూద్రి గురుస్వామి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో పంచలోహ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా శనివారం శ్రీసజీవ్ నంబూద్రి గురుస్వామి బృందంతో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు గణపతి, గాయత్రి హోమం, అంకురార్పణ పూజ, బింబ శుద్ధిక్రియలు, నాగదేవత పూజ, దాన్యాదివాసం నిర్వహించారు. అనంతరం హారతి, తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రధాన గురుస్వామి శ్రీఅద్దెంకి సారంగచారి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులను దోచుకుంటున్నారు


తేమశాతం పరిశీలిస్తున్న విజయరమణరావు

ఓదెల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట నిర్వాహకులు, మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఆరోపించారు. మండలంలోని పొత్కపల్లి ఐకేపీ ధాన్యం సెంటర్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తరుగు పేరిట 8 నుంచి12 కిలోల రైతుల వద్ద నుంచి దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. డీఎస్‌వోతో ఫోన్‌లో మాట్లాడి నిబంధనల మేరకు కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. ఎంపీటీసీ రాగి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అంబాల కొమురయ్య, మాజీ సర్పంచ్ పడాల రాజు, మాజీ ఎంపీటీసీ నీర్ల శ్రీనివాస్, నాయకులు రెడ్డి రజనీకాంత్, గట్టుయాదవ్, గొడుగు ఐలయ్యయాదవ్ పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట పలువురి బైండోవర్

సుల్తానాబాద్: మండలంలోని గ్రామాల నుంచి పలు కేసుల్లో వివాదాస్పదమైన వారిని తహసీల్దార్ యాకన్న ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండడానికి ముందస్తుగా బైండోవర్ చేస్తున్నట్లు ఎస్సై విజేందర్ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

సుల్తానాబాద్: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం మహిపాల్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం తహశీల్దార్ యాకన్నకు వినతిపత్రం అందజేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ కోతలు విధించకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు అశోక్ రావు, పట్టణ అధ్యక్షుడు ఎల్లంకి రాజన్న, పూసాల మాజీ సర్పంచ్ లంక శంకర్, కనుకుల సింగిల్‌విండో వైస్ చైర్మన్ కొమ్మిడి తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు కొమ్ము తిరుపతియాదవ్, నాగుల మల్యాల తిరుపతి, సాదరి మహేందర్‌యాదవ్, వేగోళం శ్రీనివాస్‌గౌడ్, కామణి రాజేంద్రప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి కోట నాగేశ్వర్, పట్టణ ప్రధాన కార్యదర్శి భూసారపు సంపత్, గుడ్ల వెంకటేశ్, రుషి కుమార్, ఏలివేని తిరుపతియాదవ్, చిట్టవేణి సదయ్య, అమ్ముల కుమార్‌యాదవ్, బుర్ర సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న మహిపాల్‌రెడ్డి



వైభవంగా గంగబోనం

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట గ్రామంలో కుర్మ, యాదవ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న బీరన్న పట్నాల ఉత్సవాల్లో భాగంగా శనివారం గంగబోనం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీర్ల పూజారులు గ్రామంలోని ప్రధానరోడ్డు వెంట చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కుర్మ, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెద్దపల్లిరూరల్: మండలంలోని నిట్టూరు, నిమ్మనపల్లి, పెద్దబొంకూర్, పెద్దకల్వల గ్రామాలతో పాటు పెద్దపల్లి శివారులోని రంగంపల్లి, చందపల్లి, పెద్దపల్లిలో ఆదివారం ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ సత్యనారాయణ తెలిపారు.

✦పాలకుర్తి, బసంత్‌నగర్‌లో..

పాలకుర్తి: పాలకుర్తి మండలం కన్నాల, బసంత్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం సాయంత్రం 5గంటల నుంచి 6:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వంశీకృష్ణ శనివారం తెలిపారు.

✦కారు దగ్ధం

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని వన్ ఇంక్‌లైన్ సమీపంలోని జనగామ శివారులో గాజుల తిరుపతికి చెందిన కారు దగ్ధమైంది. తిరుపతి ఎన్టీపీసీలో నివాసం ఉంటున్నాడు. ఆయన కుటుంబ సభ్యులను జనగామలోని ఇంటి వద్ద దింపి తిరిగి ఎన్టీపీసీకి వస్తున్న క్రమంలో కారులో మంటలు లేచాయి. తిరుపతి కారులోంచి క్షేమంగా బయటపడ్డాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

✦అన్నివర్గాల అభ్యున్నతికి కృషి

మంథని: మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, మున్సిపల్ ఎస్సీ సెల్ నాయకుడు పీక మల్లయ్య అన్నారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. మంథనిలోని అంబేడ్కర్ నగర్‌లో జరిగే శుభ, అశుభ కార్యక్రమాలకు బ్రాహ్మణులు వెళ్లడం లేదనే మాట అవాస్తమన్నారు. శ్రీధర్‌బాబుపై ఆరోపణలు సరికాదన్నారు.

✦మన ఊరు – మన బడి పనులు పరిశీలన

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని రత్నాపూర్, నాగేపల్లి, బేగంపేట ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మనఊరు మనబడి పనులను ఎంపీడీవో రమేశ్ శనివారం పరిశీలించారు. సర్పంచ్‌లు పల్లె ప్రతిమ, కొండవేన ఓదెలు, బుర్ర పద్మ ఉన్నారు.

✦రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పనులు

కమాన్‌పూర్: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగిరి మండలం సెంటినరీకాలనీలోని అమరవీరుల స్థూపం వద్ద చేపట్టిన పనులను సింగరేణి అధికారులు, టీబీజీకేఎస్ నాయకులు శనివారం పరిశీలించారు. సివిల్ డీజీఎం పర్సనల్ పద్మరాజు, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, నాయకులు శ్రీనివాస్, రామకృష్ణ ఉన్నారు.

✦సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

జూలపల్లి: సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని ఎస్సై వెంటకృష్ణ సూచించారు. మండలంలోని కుమ్మరికుంటలో శనివారం గ్రామస్తులతో మాట్లాడారు. నేరం జరిగినట్లు అనుమానం వస్తే 100నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశ్ యాదవ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పేదలకు అండగా సీఎం కేసీఆర్


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: రాష్ట్రంలోని పేదలకు సీఎం సహాయనిధి అభయహస్తంగా నిలుస్తోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బాధితులను శనివారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో కలుసుకుని ఎల్‌వోసీ చెక్కులు అందించారు. నరాల వ్యాధితో బాధపడుతున్న అంతర్గాం మండలం పెద్దంపేటకు చెందిన మొహమ్మద్ ఇస్మాయిల్‌కు రూ.8లక్షలు, రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్‌కు చెందిన గన్ను మాధవికి రూ.2.5లక్షలు, 31వ డివిజన్‌కు చెందిన పారిపెల్లి లావణ్యకు రూ.2.5లక్షలు, 50వ డివిజన్‌కు చెందిన దేవేందర్‌కు రూ.లక్ష, మొత్తంగా నలుగురికి రూ.14లక్షల విలువ గల ఎల్‌వోసీ చెక్కులను అందించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నెహ్రూ వర్ధంతి

కమాన్‌పూర్: జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు వైనాల రాజు, ఎంపీటీసీ శెవ్వ శంకరయ్య, నాయకులు సత్యనారాయణ, రాజయ్య, ఇక్బాల్, శేఖర్, అప్సర్, కుమార్, శంకర్, రాజు పాల్గొన్నారు.

ముస్త్యాలలో..

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాలలో గ్రామ పంచాయతీలో సర్పంచ్ లావణ్య ఆధ్వర్యంలో శనివారం నెహ్రూ వర్ధంతి సందరభంగా ఆయన చిత్రపటానికి సర్పంచ్ లావణ్య పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యదర్శి పర్శరాం, నాయకులు వెంకటేశ్వరరావు, ఓదెలు పాల్గొన్నారు.

మంథనిలో..

మంథని: మంథనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్, పట్టణ అధ్యక్షుడు శివ, మున్సిపల్ కౌన్సిలర్ రమాదేవి, నాయకులు సురేందర్‌రెడ్డి, అజీంఖాన్ ఉన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

జూలపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు, ఎన్నికలపై తహసీల్దార్ జయశ్రీ శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో 18ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దండె వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మానుమండ్ల శ్రీనివాస్, మామిడిపల్లి చంద్రశేఖర్, కొమ్ము రాజయ్య, మల్లెత్తుల అంజయ్య, నెరువట్ల రాజు, మేకల నారాయణ, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

రామగిరి మండలంలో..

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని అన్ని గ్రామాల్లో 18ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరినీ ఓటర్‌గా నమోదు చేయాలని తహసీల్దార్ రామ్మోహన్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల అధ్యక్షులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ తహసీల్దార్ రాకేశ్, ఆర్‌ఐ రాజబాబు, నాయకులు కుమార్, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.


జూలపల్లి: మాట్లాడుతున్న తహసీల్దార్ జయశ్రీ

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్: 18 ఏళ్లు నిండిన వారు ఆన్‌లైన్‌లో ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ యాకన్న కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన అఖిలపక్షం సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్ చందర్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు కడారి అశోక్‌రావు, సీపీఐ మండల కార్యదర్శి కడారి సునీల్ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి

సుల్తానాబాద్: పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించి సంరక్షించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీతగౌడ్ కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2023 కార్యక్రమంలో భాగంగా శనివారం 15వ వార్డులో ఇల్లు తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్, వార్డు ఆఫీసర్ పోచయ్య, జవాన్లు ఆనంద్, రాజు పాల్గొన్నారు.

ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

ఓదెల: ప్రభుత్వం ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయకపోవడంతో కేంద్రాల్లోనే నిల్వలు మూలుగుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు శనిగరపు రమేశ్ మండిపడ్డారు. ఓదెల తహసీల్ కార్యాలయం ఎదుట శనివారం గంటపాటు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించి ప్రస్తుతం కొర్రీలతో రైతులను వేధిస్తున్నారని ఆరోపించారు. నాయకులు కుక్కల మహేందర్, కొత్త వెంకటరెడ్డి, కొండపాక నర్సింహాచారి, తూడి రాజేందర్, ఆది సతీశ్ పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత



ఓదెల: ఓదెల మల్లన్న దర్శనం కోసం వచ్చే భక్తులకు ఓదెల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, ఆర్ఎంపీ డాక్టర్ సతీశ్ వీల్‌చైర్‌ను ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్‌కు శనివారం అందజేశారు. మల్లన్నజాతరకు వచ్చే దివ్యాంగుల సౌకర్యార్థం వీల్‌చైర్ అందజేసినట్లు ఆర్ఎంపీ సతీశ్ పేర్కొన్నారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



మంథని: మంథని మున్సిపల్ కార్యాల యం ఎదుట పట్టణంలోని ఉస్మాన్‌పుర కాలనీకి చెందిన ముస్లిం మహిళలు శనివారం రాత్రి ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. కాలనీలో ఒకే కుళాయి ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీంతో నిరసన తెలిపిన మహిళలు సమస్య పరిష్కరించకుంటే మళ్లీ నిరసన తెలుపుతున్నాని చెప్పారు. కాగా మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతు పనుల నేపథ్యంలో పట్టణంలో రెండు రోజులుగా మంచినీటి సరఫరా కావడం లేదు.